ప్రజాశక్తి
ఆదివారం 30 నవంబర్ 2025 5 అనంతపురం

క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న కలెక్టర్ ఆనంద్

ఆటల్లోనూ వికలాంగులు రాణించాలి

కలెక్టర్ ఓ.ఆనంద్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్‌లో

తాము ఎందులోనూ తక్కువ కాదన్న మనో ధైర్యంతో వికలాంగులు ఆటల్లోనూ ప్రతిభ చాటి రాణించాలని కలెక్టర్ ఓ.ఆనంద్ పిలుపునిచ్చారు. అంతర్జాతీయ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం-2025 డిసెంబర్ 3వతేదీ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో శనివారం నాడు అనంతపురం నగరంలోని పోలీస్ ట్రైనింగ్ కాలేజ్‌లో విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ విభిన్న ప్రతిభావంతుల కార్పొరేషన్ ఛైర్మన్ గడుపుటి నారాయణ స్వామి పాల్గొని కలెక్టర్‌తో కలిసి ఆటల పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా నారాయణస్వామి మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులు ఎందులోనూ తీసిపోరని, వాళ్ళల్లోనూ ఆత్మస్థైర్యం పెంపొందించడానికి ప్రభుత్వం ఆటల పోటీలను నిర్వహిస్తోందన్నారు. విభిన్న ప్రతిభా వంతుల కార్పొరేషన్ ద్వారా అన్ని సహాయ పరికరాలు అందిస్తామని తెలిపారు. కలెక్టర్ ఓ.ఆనంద్ మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం ద్వారా వచ్చే అన్ని పథకాల్లో వారికి రావాల్సిన రిజర్వేషన్ తప్పక అమలు చేస్తామన్నారు. జిల్లాలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో విభిన్న ప్రతిభావంతులకు అనుకూలంగా రాంప్స్, లిఫ్ట్ ఏర్పాటు చేసేలా ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని తెలిపారు. వికలాంగులు అందరూ గుర్తింపు కార్డును తప్పనిసరిగా పొందాలన్నారు. క్రీడా పోటీలు ఎంతో ఉపకరిస్తాయని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు జి.అర్చన తెలిపారు. రన్నింగ్ 100 మీటర్స్, షాట్ పుట్, డిస్కస్ త్రో, లాంగ్ జంప్, సాఫ్ట్ బాల్ పోటీల్లో విభిన్న ప్రతిభావంతులు సుమారు 500 మంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిసి సంక్షేమ శాఖ డిడి కుష్బు కొఠారి, ఐసిడిఎస్ పీడీ అరుణకుమారి, డిఎస్‌డిఒ మంజుల పాల్గొన్నారు.

'పురం' మున్సిపాల్టీలో ఏసీబీ దాడులు

లంచం తీసుకుంటూ పట్టుబడ్డ ఆర్ఐ

ప్రజాశక్తి-హిందూపురం

శ్రీ సత్యసాయి జిల్లా హిందూపురం మున్సిపల్ కార్యాలయంలో శనివారం నాడు అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు దాడులు నిర్వహించారు. లంచం తీసుకుంటున్న మున్సిపల్ రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ రామాంజినేయులును పట్టుకుంటున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... ముదిరెడ్డిపల్లిలో నివాసముంటున్న రవికుమార్ తనకు ఉన్న స్థలంలో ఇంటిని నిర్మాణం చేసుకోవడానికి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను సంప్రదించాడు. రికార్డులను పరిశీలించిన అధికారులు ఖాళీ జాగా పన్ను విధింపు రసీదు లేదని, ఖాళీ జాగా పన్ను చెల్లించి రసీదు ఇవ్వాలని సూచించారు. దీంతో రవికుమార్ తనకు ఉన్న కాళీ జాగా పన్నులు వేయాలంటూ రెవెన్యూ అధికారులను సంప్రదించాడు. రికార్డులను పరిశీలన చేసిన అధికారులు సచివాలయంలో ఆన్‌లైన్ చేయించిన అనంతరం కలవాలని సూచించారు. అన్ని పనులూ పూర్తిచేసుకుని గురువారం తిరిగి రెవెన్యూ విభాగంలో అధికారిని కలిశాడు. పరిశీలన చేసిన అధికారులు ఖాళీ జాగాకు అధిక పన్ను వస్తుందని, తమకు లంచం ఇస్తే పన్ను తక్కువ చేస్తామని రవికుమార్‌కు సూచించారు. తొలుత రూ.10వేలు అడగ్గా అంత ఇవ్వలేని చెప్పి రూ.7 వేలు ఇచ్చేలా బేరం కుదుర్చుకున్నారు. లంచం డిమాండ్ చేయడం, తన పని జరగకుండా ఇబ్బందులు పెడుతున్న అధికారుల అవినీతి విషయాన్ని రవికుమార్ 1064 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫిర్యాదు చేశాడు. దీంతో అవినీతి నిరోధక శాఖ అధికారులు రంగంలోకి దిగారు. కర్నూలు ఏసీబీ డీఎస్పీ సోమన్న నేతత్వంలో సిఐలు హమీద్ ఖాన్, మోహన్ ప్రసాద్, జయమ్మల ఆధ్వర్యంలో అధికారులు పక్కాగా వలపన్ని లంచం తీసుకుంటున్న సమయంలో ఆర్ఐ రామాంజినేయులును రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అనంతరం రెవెన్యూ విభాగంలో అధికారులు పలు దస్త్రాలను పరిశీలించారు. అక్కడి నుంచి ముదిరెడ్డిపల్లిలో ఉన్న 36వ వార్డు సచివాలయానికి రామాంజనేయులు తీసుకువెళ్ళి అక్కడ సైతం కొన్ని రికార్డులను పరిశీలన చేశారు. అనంతరం అధికారులు లంచం తీసుకున్న రామాంజినేయులును అరెస్టు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ సందర్భంగా ఏసీబీ డీఎస్పీ సోమన్న మాట్లాడుతూ అన్ని ఆధారాలతో సహా అధికారిని పట్టుకున్నామన్నారు. ఆదివారం కర్నూలులో ఏసీబీ కోర్టులో అతన్ని హాజరు పరుస్తామన్నారు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఎవరైనా లంచం అడిగితే టోల్ ఫ్రీ నెంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు.

స్వాధీనం చేసుకున్న నగదుతో పాటు అధికారిని చూపిస్తున్న ఎసిబి

మెప్మా విభాగంలో ఖాళీగా ఉన్న కుర్చీలు

సిబ్బంది, అధికారులు లేనిపరిపాలన విభాగం

ఏసీబీ దెబ్బకు కార్యాలయం ఖాళీ.!

◆ అధికారులు, సిబ్బంది జంప్ ◆ ఏసీబీ వస్తే అధికారులకెందుకంత భయం అంటూ ప్రజల్లో చర్చ

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం పురపాలక సంఘంలో శనివారం రెవెన్యూ విభాగంలో ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించారు. ఏసీబీ అధికారుల రాకతో మిగిలిన అన్ని విభాగాలు అధికారులు సైతం మాయం అయ్యారు. నిత్యం మహిళలతో ఉండే మెప్మా విభాగంలో కనీసం డేటా ఎంట్రీ ఆపరేటర్ కూడా లేకుండా అన్నీ ఖాళీ కుర్చీలే కన్పించాయి. ప్రధాన పరిపాలన విభాగంలో ఒక్క గుమస్తా కూడా లేరు. మేనేజర్ ఇతర అధికారులు సైతం సాయంత్రం వరకు అందుబాటులోకి రాలేదు. ఇంజినీరింగ్ విభాగంలో గుమస్తాలు కూడా కార్యాలయానికి రాకుండా మొహం చాటేశారు. పట్టణ పారిశుధ్య విభాగం, జనన మరణాల ధ్రువీకరణ పత్రాలు అందించే విభాగాల్లోనూ ఇదే పరిస్థితి కన్పించింది. అధికారులెవరూ లేకపోవడంతో వివిధ పనుల నిమిత్తం మున్సిపల్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఏసీబీ అధికారులు రావడంతో అధికారులందరూ ఇలా భయపడి వెళ్లిపోవడంతో 'పురం' మున్సిపాల్టీలోని అన్ని శాఖల్లో ఏ స్థాయిలో అవినీతి జరుగుతుందోనన్న చర్చ ప్రజల్లో వినిపిస్తోంది. అధికారులు ఇంతా భయపడి కార్యాలయం ఖాళీ చేయాల్సిన అవసరం ఏమిటంటూ ప్రశ్నిస్తున్నారు.

ఖాళీగా ఉన్న ఇంజనీరింగ్ విభాగం

సిబ్బంది లేకా వెలవెలబోతున్న జనన, మరణ విభాగం

ఆర్డీటీని సందర్శించిన 'రిక్కీ కేజ్'

రిక్కీ కేజ్‌తో మాంఛూఫెర్రర్, ఆర్డీటీ ప్రతినిధులు

ప్రజాశక్తి-అనంతపురం

ప్రఖ్యాత భారతీయ సంగీత స్వరకర్త, పర్యావరణవేత్త, మూడుసార్లు గ్రామీ అవార్డు గ్రహీత, పద్మశ్రీ రిక్కీ కేజ్ ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్, హైస్కూల్ ఫర్ ఇన్క్లూజివ్ ఎడ్యుకేషన్‌ను శనివారం సందర్శించారు. ఆర్డీటీ ప్రోగ్రాం డైరెక్టర్ మాంఛూ ఫెర్రర్, ఆర్డీటీ మహిళా సాధికారత డైరెక్టర్ విషా ఫెర్రర్, స్పోర్ట్స్ డైరెక్టర్ సాయి కృష్ణలు ఆయనకు ఆర్డీటీ గురించి తెలియజేశారు. వైకల్యాలున్న పిల్లలు, యువతకు విశ్వాసం, సమానత్వం, అవకాశాలను బలోపేతం చేయడంలో క్రీడ, సమ్మిళిత విద్య పాత్ర గురించి రిక్కీ కేజ్‌తో చర్చించారు. ఈ సందర్భంగా కేజ్ మాట్లాడుతూ ఆర్డీటీ స్పోర్ట్స్ అకాడమీలో సౌకర్యాలు చాలా బాగున్నాయన్నారు. ఉన్నత పాఠశాల ఫర్ ఇన్క్లూజివ్ ఎడ్యుకేషన్ స్ఫూర్తిదాయకంగా ఉందన్నారు.

రక్తదానంపై అవగాహన

ప్రజాశక్తి-అనంతపురం

ఎస్ఎస్‌బిఎన్ డిగ్రీ కాలేజ్, అనంతపురం ఎన్ఎస్ఎస్ యూనిట్-1 ఆధ్వర్యంలో జరుగుతున్న ఎన్ఎస్ ప్రత్యేక కార్యక్రమంలో శనివారం 6వ రోజు కొనసాగాయి. ఇందులో భాగంగా ఇటికలపల్లిలో రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. రక్తదానం చేయాలనే ఆసక్తి ఉన్న వారి వివరాలు తీసుకున్నారు. అనంతరం గ్రామంలోని పాఠశాల పరిసరాలు, ప్రజా ప్రదేశాలను శుభ్రం చేసి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.బాబా ఫక్రుద్దీన్, అధ్యాపకులు డా॥కెపి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

7న జాతీయ ఉపకార వేతన పరీక్ష

ప్రజాశక్తి-అనంతపురం సిటీ

2025-26 విద్యా సంవత్సరానికి సంబంధించి జాతీయ ఉపకార వేతన పరీక్షను డిసెంబర్ 7వ తేదీ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు నిర్వహిస్తున్నట్లు డిఇఒ ప్రసాద్ బాబు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు వారి హాల్‌టికెట్లను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం వెబ్‌సైట్ డబ్ల్యుడబ్ల్యు.బిఎస్ఇ.ఏపీ.గవ్.ఇన్ నందు పొందవచ్చున్నారు. వాట్సాప్ మనమిత్రలో సైతం అందుబాటులో ఉంచామన్నారు. సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాఠశాల యు-డైస్ కోడ్‌ను ఉపయోగించి లాగిన్ అయి వారి పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసి విద్యార్థులకు ఇవ్వాలన్నారు. హాల్ టికెట్‌లో ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే విద్యార్థి పరీక్ష కేంద్రం తెలుస్తుందన్నారు.

భయపరెడ్డి కుటుంబానికి పరామర్శ

భయపరెడ్డితో మాట్లాడుతున్న శైలజనాథ్

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల పరిధిలోని పసులూరు గ్రామానికి చెందిన వైసిపి నాయకుడు చిన్న పరెడ్డిగారి భయపరెడ్డి తండ్రి రెండు రోజుల క్రితం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ మంత్రి సాకే శైలజనాథ్ శనివారం భయపరెడ్డిని పరామర్శించారు. శైలజనాథ్ వెంట వైసిపి మండల కన్వీనర్ గువ్వల శ్రీకాంత్ రెడ్డి, చికెన్ నారాయణస్వామి, పిట్టు సూర్య చంద్రారెడ్డి ఉన్నారు.

సమస్యలపై ఐక్యంగా పోరాడుదాం

ముస్లిం యునైటెడ్ జెఎసి

ప్రజాశక్తి-అనంతపురం

అనంతపురం జిల్లాలోని ముస్లిముల సమస్యలపై పార్టీలకు అతీతంగా కలసి పోరాడుదామని ముస్లిం యునైటెడ్ జెఎసి నాయకులు పేర్కొన్నారు. అనంతపురం నగరంలోని డిఆర్ ఫంక్షన్ హాలులో నగరంలోని ముస్లిం నాయకులు, మతపెద్దలు అందరూ కలసి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి మానవ హక్కుల వేదిక నాయకులు, న్యాయవాది అబ్దుల్ రసూల్, మైనార్టీ నాయకులు షకీల్ షఫి, సాలార్‌బాషా, జాఫర్, ఆవాజ్ వలి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అబ్దుల్ రసూల్ యూనైటెడ్ జెఎసి లక్ష్యాలను వివరించారు. ముస్లిములకు నాలుగు శాతం రిజర్వేషన్‌కు చట్టబద్ధత కల్పించాలని, సచార్ కమిటీ నివేదికను అమలు చేయాలని, జనాభా ప్రతిపాదికన బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని, సబ్ ప్లాన్ అమలు చేయాలని డిమాండ్‌లో ఉన్నట్టు పేర్కొన్నారు. రాజకీయాల్లో జనాభా ప్రాతిపదికన ప్రాతినిధ్యం కల్పించాలని కోరారు. సారూప్యత కలిగిన ఎస్సీ,ఎస్టీ, గిరిజన సంఘాలతో కలసి సమస్యలపై పోరాడాలనే లక్ష్యంతో జెఏసి ముందుకెళ్లనున్నట్లు వివరించారు. జెఏసికి కన్వీనర్‌గా సి.జాఫర్‌ను ఎన్నుకున్నారు. రాబోయే రోజుల్లో జిల్లాలో పార్టీలకు అతీతంగా మైనార్టీల సమస్యలపై పనిచేసే సంఘంగా రూపొందిస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ వసీం, మాజీ గ్రంథాలయ ఛైర్మన్ గౌసుమోహిద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులను ఆదుకుంటాం : విప్

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

దళారుల చేతిలో మోసపోకుండా మొక్కజొన్న రైతులను ఆదుకుంటామని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవరెడ్డిపల్లి గ్రామంలో రైతు రామిరెడ్డి పొలంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను విప్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మొక్కజొన్న పంటను దళారులు రూ.1800 నుంచి 1900 వరకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నట్లు వివరించారు. ప్రభుత్వం త్వరలోనే కొనుగోలు కేంద్రాలు పంటను కొనుగోలు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రజాక్‌వలి, ఎంపిడిఒ జయన్న, రెవెన్యూ ఆర్ఐ, రామాంజనేయులు, టిడిపి మండల కన్వీనర్ కాలవ సన్నన్న, గిరిమల్లప్ప, సర్పంచులు రామాంజనేయులు, నాగరాజు, ఉస్మాన్‌సాబ్, బేలోడు సంజీవ, పైదొడ్డి రాజు, వెంకటేశులు, గోవిందప్ప, హనుమంతురెడ్డి, రమేష్, తిప్పేస్వామి, సిద్ధన్న, తదితరులు పాల్గొన్నారు.

పంటలకు మద్దతు ధర ప్రకటించాలి

విలేకరులతో మాట్లాడుతున్న రైతుసంఘం నాయకులు

◆ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో నింపాలి
◆ ఏపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి
◆ రైతుసంఘం నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులు పండించే అన్ని పంటలకూ మద్దతు ధర ప్రకటించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బిహెచ్.రాయుడు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఏపి రైతు సంఘం 13వ జిల్లా మహాసభలు నవంబర్ 27,28వ తేదీల్లో గార్లదిన్నె విజయవంతంగా ముగిసిన నేపథ్యంలో మహాసభలో చేసిన తీర్మానాలు, నూతన జిల్లా కమిటీ ఎన్నిక తదితర అంశాలపై శనివారం గణేనాయక్ భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. జిల్లాలో రైతాంగం ఎదుర్కొంటున్న మద్దతు ధరలు సాగునీరు ఉద్యాన పంటలు సమస్యలపై రైతుసంఘం పోరాటాలు చేస్తుందన్నారు. ప్రభుత్వం అన్ని పంటలనూ మద్దతు ధరలతో రైతుల నుంచి కొనుగోలు చేయాలన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు హెచ్ఎల్‌సి అధునీకరణ పనులు పూర్తి చేయాలన్నారు. హంద్రీనీవా కాలువ ద్వారా పిల్ల కాలువలు ఏర్పాటు చేసి ప్రతి ఎకరాకు సాగునీరు ఇవ్వాలన్నారు. ఉంతకల్లు రిజర్వాయర్ పూర్తి చేయడానికి నిధులు కేటాయించాలన్నారు. పిఎబిఆర్ డ్యాం సామర్థ్యం పెంచడానికి ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. మిడ్ పెన్నార్, బిటిపి, చాగల్లు, సుబ్బరాయుడు సాగర్ రిజర్వాయర్లు గేట్లు, కాలువల మరమతులకు నిధులు కేటాయించి నీరు వథా కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆయకట్టుకు సాగునీరు ఇవ్వాలని కోరారు. హార్టికల్చర్ హబ్ ఏర్పాటుకు తగిన నిధులు విడుదల చేసి ఉద్యాన రైతులను ఆదుకోవాలన్నారు. జిల్లాలో ప్రతి మండలంలో కోల్డ్ స్టోరేజ్‌లు జ్యూస్ ఫ్యాక్టరీలు చిప్స్ ఫ్యాక్టరీలు ఏర్పాటు చేయాలన్నారు. పండ్ల తోటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా పంటలు ఎగుమతులకు ప్రభుత్వమే మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బి.శివారెడ్డి, సహాయ కార్యదర్శి ఆర్.కుళ్లాయప్ప, జిల్లా కమిటీ సభ్యులు పోతలయ్య, సంజీవరెడ్డి, వెంకటకొండలు పాల్గొన్నారు.

అధ్యక్ష, కార్యదర్శులుగా బిహెచ్.రాయుడు, ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి

చంద్రశేఖర్‌రెడ్డి

బిహెచ్.రాయుడు

రైతు సంఘం జిల్లా నూతన కమిటీని 34 మందితో ఎన్నుకున్నారు. రైతు సంఘం జిల్లా అధ్యక్షులుగా బిహెచ్.రాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా ఆర్.చంద్రశేఖర్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులుగా తరిమెల నాగరాజు, వి.శివారెడ్డి, ఎన్.మధుసూదన్, జి.విరుపాక్షి, జి.రాజారాంరెడ్డి, జిల్లా సహాయ కార్యదర్శులుగా డి.దస్తగిరి, జి.శిరీషా, సి.చెన్నారెడ్డి, ఆర్.కుళ్లాయప్ప, జిల్లా కమిటీ సభ్యులుగా వలి, రెడ్డిపల్లి శ్రీనివాసులు, సంజీవరెడ్డి, ఎం.పోతులయ్య, ఈరప్ప, వెంకటేశులు, జయమ్మ, రామసాగరం శ్రీనివాస్ రెడ్డి, సాయికుమార్, మద్దిలేటి రమేష్, దేవేందర్ రెడ్డి, కొండారెడ్డి, హరినాథ్ రెడ్డి, జయచంద్రారెడ్డి, సుధాకర్, మల్లికార్జున, భాస్కర్ రెడ్డి, వెంకటకొండ, జయ శేఖర్ రెడ్డితో కమిటీని ఎన్నుకున్నారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ

1న అనంతలో ర్యాలీ - డిఎంహెచ్ఒ డా॥ఈబి.దేవి

ప్రజాశక్తి - అనంతపురం

విలేకరులతో మాట్లాడుతున్న డా॥ఈబి.దేవి

వ్యక్తిగత, కుటుంబ అవగాహనతో ఎయిడ్స్ నియంత్రణ సాధ్యమవుతుందని జిల్లా వైద్యాధికారి డా॥ఈబి.దేవి తెలిపారు. శనివారం నాడు జిల్లా వైద్యాధికారి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ హెచ్ఐవి సోకిన వారిపట్ల ఆదరణ భావం కలిగి ఉండి వారిలో ఆత్మవిశ్వాసం పెంచాలన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని డిసెంబర్ 1వ తేదీన అనంతపురం నగరంలోని ఆర్ట్స్ కాలేజ్ నుంచి అవగాహన ర్యాలీని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయం సమావేశ మందిరంలో హెచ్ఐవి నియంత్రణలో సమర్థవంతంగా పనిచేసిన ఉద్యోగులు, సహకరించిన ఇతర అధికారులు, వ్యక్తులకు ప్రశంసా పత్రాలు ప్రదానం చేస్తాన్నారు. సాయంత్రం 6 గంటలకు క్యాండిల్ లైట్ విజిల్ కార్యక్రమం, హెచ్ఐవితో జీవిస్తున్న వారితో జిల్లా అధికారులు సహపంక్తి భోజన కార్యక్రమం జరుగుతుందన్నారు. జిల్లా ఎయిడ్స్ నియంత్రణ విభాగానికి రాష్ట్ర స్థాయిలో ఉత్తమ విభాగంగా ఎంపికయిందన్నారు. వైరల్ లోడ్ లాబొరేటరీ, స్టేట్ రిఫరెన్స్ లాబొరేటరీ లింక్ వర్కర్ స్కీం కూడా రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపికయ్యాయని తెలిపారు. వీరికి డిసెంబరు 1న విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో అవార్డులు అంజేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్స్ విభాగం ప్రోగ్రాం మేనేజర్ వెంకటరత్నం, రమణ, డెమో నాగరాజు, ఎచ్ఈఈఒ త్యాగరాజు, డిప్యూటీ హెచ్ఇఒ గంగాధర్ పాల్గొన్నారు.

కొనసాగిన రిలేదీక్షలు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులపై పాలకులకు కనికరం లేకుండా పోయిందని సిఐటియు నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారం కోసం శ్రీరామిరెడ్డి తాగునీటి కార్మికులు చేపట్టిన రిలేదీక్షలు శనివారం 13వరోజుకు చేరుకున్నాయి. దీక్షలో కూర్చున్న కార్మికులకు సిఐటియు తాలుకా అధ్యక్షుడు రంగనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి రాము సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులను అన్యాయం చేస్తే పోరాటాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 18ఏళ్లుగా కార్మికులు పని చేస్తుంటే కొత్తగా వచ్చిన తాగునీటి పథకం కాంట్రాక్టర్ బెదిరింపులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఆయన అనుచరులుగా వ్యవహరిస్తున్న కిరణ్, గౌతమ్ దౌర్జన్యంగా ఖాళీ బాండ్లలో సంతకాలు చేయించుకోవడం చట్టవిరుద్ధమన్నారు. దీక్షలో తాగునీటి పథకం యూనియన్ నాయకులు వన్నూరుస్వామి, అశోక్, ఓబుళపతి, శివ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

రిలేదీక్షల్లో కూర్చొన్న కార్మికులు

రైతులను అన్నివిధాలుగా ఆదుకుంటాం

'రైతన్నా-మీకోసం'లో ఎమ్మెల్యేలు

ప్రజాశక్తి-గుమ్మఘట్ట

మాట్లాడుతున్న విప్ కాలవ శ్రీనివాసులు

రైతులను అన్ని విధాలుగా ఆదుకుంటామని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల పరిధిలోని దేవరెడ్డిపల్లి గ్రామంలో 'రైతన్నా-మీకోసం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగం గత ప్రభుత్వంలో ఐదేళ్లపాటు సంక్షోభం ఎదుర్కొందన్నారు. అయితే ఒకటిన్నర సంవత్సరం కిందట కొలువుదీరిన ఎన్‌డిఎ ప్రభుత్వం రైతులను బతికించి వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చాలని సిఎం చంద్రబాబు అనేక కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. చంద్రబాబు గారు వచ్చిన తర్వాత రైతుల్లో నమ్మకం.. భరోసా వచ్చిందన్నారు. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ కింద రాష్ట్రంలో 46 లక్షల మంది రైతులు రెండు విడతల్లో రూ.6,310 కోట్ల లబ్ధి పొందారని వివరించారు. అలాగే సబ్సిడీపై బిందు సేద్య పరికరాలను అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రజాక్‌వలి, ఎంపిడిఒ జయన్న, పిఆర్‌డిఇ సుధాకర్‌నాయక్, ఆర్ఐ రామాంజనేయులు, ఎస్ఐ ఈశ్వరయ్య, తదితరులు పాల్గొన్నారు.

శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ఆత్మకూరు : గత ఐదేళ్ల వైసిపి పాలనలో కనీసం కిలో మీటర్ రోడ్డు వేయలేని అసమర్థుడు మాజీ ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి అని ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. శనివారం మండలంలోని పి.కొత్తపల్లి గ్రామంలో జరిగిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, రైతన్నా-మీ కోసం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇందులో భాగంగా మెయిన్ రోడ్డు నుంచి పి.కొత్తపల్లి గ్రామానికి వేసిన బీటీ రోడ్డు, సీసీ రోడ్లను ప్రారంభించారు. ఆర్డీటీ సంస్థ, గ్రామ పంచాయతీకి సంబంధించి రూ.5.40లక్షలతో నిర్మించిన వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభించారు. అనంతరం రైతన్నా-మీకోసంలో భాగంగా కంది, చీనీ పంటలను పరిశీలించారు. తర్వాత బీసీ కాలనీవాసులు వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటు చేస్తున్నామని చెప్పగానే స్పందించిన ఎమ్మెల్యే రూ.లక్ష విరాళం అందజేశారు.

అక్రమ కేసులకు బెదరం

వైసిపి నగర అధ్యక్షుడు చింతా సోమశేఖరరెడ్డి

ప్రజాశక్తి-అనంతపురం

అక్రమ కేసులకు భయపడే ప్రసక్తే లేదని వైసిపి నగర అధ్యక్షులు చింతా సోమశేఖరరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అక్రమ కేసుల పరంపర కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా వైసిపి సోషల్ మీడియా యాక్టివిస్టుల నుంచి వైసిపి నాయకులు, కార్యకర్తల వరకు అందరిపై అక్రమంగా కేసులు పెడుతున్నారన్నారు. ఇటీవల కాలంలో అనంతపురం నగరంలో పోలీసులను అడ్డుపెట్టుకుని వైసీపీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. పోలీసులు కూడా విచిత్రంగా ప్రవర్తిస్తున్నారని.. చట్టం చెప్పినట్లు కాకుండా ఎమ్మెల్యే, అధికార పార్టీ నేతలు చెప్పినట్లు నడుచుకుంటున్నారని విమర్శించారు. ఇందులో భాగంగానే శనివారం వైసిపి నాయకులు కృష్ణమూర్తిని నోటీసులు ఇస్తామని పోలీస్‌స్టేషన్‌కు పిలిచి అరెస్ట్ చేశారన్నారు. అదేవిధంగా ఇటీవల ప్రభుత్వ మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ చేస్తుంటే టీడీపీ నాయకులు కవ్వింపు చర్యలకు పాల్పడి వైసీపీ నాయకులపై అక్రమ కేసులు పెట్టారన్నారు. పాతూరులో కూడా కుటుంబ సభ్యులు గొడవ చేసుకుంటే దాన్ని వైసిపికి ఆపాదిస్తూ కేసులు పెట్టారని తెలిపారు. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఐదేళ్లు మాత్రమేననే విషయాన్ని పోలీసులు గుర్తుంచుకోవాలన్నారు. ఈ సమావేశంలో వైసీపీ బూత్ కమిటీ జిల్లా అధ్యక్షుడు ఎద్దుల అమర్నాథ్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, కార్పొరేటర్ శ్రీనివాసులు, వైసీపీ నేతలు సాకే కుళ్లాయిస్వామి, సాకే అశోక్ పాల్గొన్నారు.

సిఐటియు మహాసభలను విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

మానవహారంగా ఏర్పడిన అంగన్వాడీలు

వచ్చేనెల 31వ తేదీ నుంచి విశాఖపట్నంలో నిర్వహించనున్న సిఐటియు అఖిల భారత 18వ మహాసభలను జయప్రదం చేద్దామని అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు శకుంతల పిలుపునిచ్చారు. శనివారం శెట్టూరు మండల కేంద్రంలో ఇందుకు సంబంధించిన పోస్టర్లను విడుదల చేశారు. తర్వాత మానవహారం ఏర్పాటు చేసి సిఐటియు లక్ష్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ యూనియన్, హెల్పర్లు అవ్వర్ల, సరస్వతి, దాక్షాయణి, పార్వతి, విశాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మానసిక, శారీరక ఆరోగ్యం అవసరం

సర్వజనాసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ హేమలత

విద్యార్థులతో సర్వజనాసుపత్రి ఆర్ఎంఒ హేమలత

ప్రజాశక్తి-అనంతపురం

విద్యార్థి దశలో మానసిక శారీరక ఆరోగ్యం ఎంతో కీలకమైందని సర్వజన ఆసుపత్రి ఆర్ఎంఒ డాక్టర్ హేమలత సూచించారు. శనివారం స్థానిక హౌసింగ్ బోర్డులోని ఆర్యన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో విద్యార్థులతో కలిసి ఆటపాటలు ఆడుతూ మానసిక శారీరక ఆరోగ్యంపై అనేక అంశాలను విద్యార్థులకు వివరించారు. ముఖ్యంగా మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు విద్యార్థులు పాటించాల్సిన అంశాలను వివరిస్తూ వారిలో సృజనాత్మకతను గెలిచే ప్రయత్నం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ వైద్య కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చల్లా నీలిమ, స్కూల్ డైరెక్టర్లు ఎం.నాగరాజు, జి.సందీప్, ప్రిన్సిపాల్ ఎం.లహరి, వైస్ ప్రిన్సిపాల్ భార్గవి, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాటలు కోటలు దాటాయి..ఆచరణ గడప దాటలేదు..!

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

అనంతపురం జిల్లాను ఫ్రూట్ బౌల్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్‌గానే కాకుండా... దీన్ని హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని నేతలు మాటల కోటలను దాటించారు. ఆచరణలోచూస్తే ఉద్యానవన రైతుకు నష్టాలు, కష్టాలు తప్ప పెట్టుబడులు కూడా వెనక్కురాని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది అన్ని ఉద్యానవన పంటల పరిస్థితి ఇదే తీరున సాగడం గమనార్హం. ఈ ఏడాదిలోనే ఫిబ్రవరి 5వ తేదీన అనంతపురం నగరంలో హార్టికల్చర్ కాన్‌క్లావ్ పేరుతో అధికారులు, ప్రజాప్రతినిధులు పెద్దఎత్తున హడావుడే చేశారు. అంతేకాకుండా ఐదేళ్ల ప్రగతిలో ఉద్యానవన పంటలకు ప్రథమ స్థానం కల్పించడంతోపాటు ఇప్పుడున్న దిగుబడులను రెండింతలు చేసి జిల్లాను అభివృద్ధి పథంలో నడిపిస్తామని గొప్పగొప్ప మాటలే చెప్పారు. ఆచరణలో రైతుకు మిగిలింది ఏమిటన్నది ప్రశ్నార్థకంగానే ఉంది. అధికారులు అప్పుడు కనబరచిన లెక్కలు ఈ విధంగా ఉన్నాయి. జిల్లాలో మొత్తం 1.04 లక్షల ఎకరాల్లో ఉద్యానవన పంటలు విస్తరించాయి. 25.95 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి రానున్నట్టు అంచనా వేశారు. ఇందులో ప్రధానంగా అరటి, మామిడి, చీనీ, టమోటా పంటలున్నాయి. గడిచిన ఐదేళ్లలో 20 లక్షల మెట్రిక్ టన్నులు ఏడాదికి వస్తుండగా వాటి ద్వారా టర్నోవర్ రూ.5535 కోట్లు ఏడాదికి జిల్లాలో జరుగుతున్నట్టు అంచనా వేశారు. ఇందులో అరటి పంట 10946 హెక్టార్లలో ఉండగా 6.02 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుంది. దీని ద్వారా రూ.1204 కోట్ల జివిఎ ఉంటుందని కాన్‌క్లేవ్ సమయంలో రూపొందించిన నివేదికలో పేర్కొన్నారు. ఇక 10128 హెక్టార్లలో 56 వేల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుంది. దీని జివిఎ రూ.567 కోట్లుకాగా, మిరప పంట 14177 హెక్టార్లలో పండిస్తున్నారు. దీని దిగుబడి 71 వేల మెట్రిక్ టన్నులు రూ.1205 కోట్లు టర్నోవర్ జరుగుతోంది. ఇక 16618 హెక్టార్లలో టమోట పంట సాగవుతోంది. ఏటా 8.30 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడులు వస్తున్నాయి. వీటి జివిఎ రూ.997 కోట్లు ఉంది. చీనీ పంట 37186 హెక్టార్లలో సాగవుతోంది. దీని దిగుబడులు 5.21 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుండగా రూ.1562 కోట్లు జివిఎ ఉంది. ఇలా అన్ని రకాలుగా ఉత్పత్తుల విలువను కాన్‌క్లేవ్ సమయంలో కనబరిచారు. అదే సభలో ఉద్యనవన రైతుల తలరాతను మారుస్తున్నామంటూ ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్పష్టం చేశారు. పండిన పంటను అమ్ముకుని రావడానికి రైతులు జిల్లా నుంచి విమానంలో పోయి వస్తున్నారని కూడా చెప్పారు. ఈ ఏడాది చూస్తే ఏ ఒక్క పంటకూ సరైన గిట్టుబాటు ధర లేదు. అరటి పంటకు ధరలేక దున్నేసుకుంటున్న పరిస్థితులు నెలకొన్నాయి. మరోవైపు మామిడి రైతులు కూడా ఈ ఏడాది సరైన ధరలేక తీవ్రంగా నష్టపోయారు. చీనీ రైతు పరిస్థితి అదే విధంగా ఉంది. ఇటువంటి సమయంలో మాత్రం ప్రభుత్వం రైతును ఆదుకునే చర్యలేవీ తీసుకోవడం లేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అరటి రైతు పంటలేక అవస్థలు పడుతుంటే ఆ పొలాలను పరిశీలించి ఆదుకుంటామని చెప్పిన ఒక్క ప్రజాప్రతినిధి కూడా జిల్లాలో కనిపించకపోవడం శోచనీయం. ప్రభుత్వం తగ్గిన ధరకు సబ్సిడీగానీ, ఎనిమిది రూపాయల వరకు ధరను కల్పించాలని కోరుతున్నారు. ఆ దిశగా నేతలెవరూ కన్నెత్తి చూడటం లేదు. విపక్షాలు మాత్రం దీనిపై ఆందోళన చేపడుతూనే ఉన్నాయి. అనంతపురం కలెక్టర్ ఆనంద్ క్షేత్రస్థాయిలో పర్యటించి వ్యాపారులతో మాట్లాడి ధర పెంచే ప్రయత్నం చేస్తున్నా, వ్యాపారుల నుంచి మద్దతు లభించడం లేదు. ధరలేక తీవ్రంగా నష్టపోతున్న ఉద్యానవన రైతులను ఆదుకునేలా ప్రభుత్వాలు ముందుకు రావాలని రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రకటనలు కాకుండా ఆచరణాత్మకమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

శ్రీచైతన్యలో ఘనంగా స్పోర్ట్స్ డే

ప్రజాశక్తి-అనంతపురం

శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులతో అతిథులు

నగరంలోని కమ్మ భవన్ సమీపంలో ఉన్న శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో డాక్టర్ బి.ఎస్.రావు స్పోర్ట్స్ మీట్ బ్రాంచ్ లెవెల్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజిఎం సుబ్బారెడ్డి, 4వ పట్టణ పోలీస్‌స్టేషన్ సిఐ జగదీష్, ఎస్ఐ విజయభాస్కర్, ప్రిన్సిపాల్ విశ్వనాథ్‌తో కలిసి క్రీడా పతాకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏజిఎం మాట్లాడుతూ శ్రీచైతన్య విద్యాసంస్థలు విద్యతోపాటు మానసిక ఉల్లాసానికి అవసరమైనటువంటి క్రీడలకు కూడా ఎంతో ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. శ్రీ చైతన్యలో విద్యనభ్యసించిన చాలామంది విద్యార్థులు అత్యున్నతమైన స్థాయిలో ఉన్నారన్నారు. అనంతరం ఆటల పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పతకాలు అందజేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఇన్‌ఛార్జులు భవిత, దివ్యశ్రీ, పిఇటిలు రవిరాజ్, విజయ, ఎఒ రామకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పప్పుశనగ పంట పరిశీలన

ప్రజాశక్తి-యల్లనూరు

మండల పరిధిలోని జంగంపల్లి గ్రామంలో సాగు చేసిన పప్పుశనగ పంటను మండల వ్యవసాయ అధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఇందులో భాగంగా పంటకు బూడిద తెగులు సోకే ఆశాజనకంగా లేకపోవడాన్ని గుర్తించారు. అకాల వర్షాలు కురిసినప్పుడు వ్యాధి సోకే ప్రమాదం ఉందని వ్యవసాయ అధికారి తెలిపారు. నివారణకు ఎకరాకి హెక్సా కొనజోల్ 400 మిల్లీలీటర్లు కానీ, ప్రొపికొనజోల్ 200 మిల్లీలీటర్లు కానీ, క్లోరోథలోనిల్ 400 గ్రాములు చొప్పున పిచికారి చేస్తే నివారించుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

జెఎన్‌టియు విసికి ఉత్తమ అవార్డు

ప్రజాశక్తి-అనంతపురం

అవార్డును అందుకుంటున్న జెఎన్‌టియు విసి

2025 సంవత్సరానికి ఇండియన్ సొసైటీ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఐఎస్‌టిఇ) ప్రతి ఏడాది ప్రకటించే ప్రతిష్టాత్మక ఉత్తమ అకడమిక్ అడ్మినిస్ట్రేటర్‌గా అవార్డు జెఎన్‌టియు ఉపకులపతి హెచ్.సుదర్శనరావును వరించింది. హెచ్.సుదర్శనరావుకు ఉత్తమ అకడమిక్ అడ్మినిస్ట్రేటర్ జాతీయ అవార్డు రావడంపై హర్షణీయమని రిజిస్ట్రార్ ఎస్.కృష్ణయ్య, ఓఎస్‌డి టూ వీసీ దేవన్న, యూనివర్సిటీ డైరెక్టర్లు సత్యనారాయణ, నాగప్రసాద్ నాయుడు, సుబ్బారెడ్డి దుర్గాప్రసాద్, సుజాత, సురేష్‌బాబు, శివకుమార్, ప్రిన్సిపాల్ చెన్నారెడ్డి, తదితరులు అభినందనలు తెలిపారు.

ఇళ్లు, స్థలాల కోసం 1278 దరఖాస్తులు

ప్రజాశక్తి-యాడికి

మండలంలో ఇల్లు, ఇళ్ల స్థలాల కోసం ప్రజల నుంచి 1,278 దరఖాస్తులు వచ్చినట్లు హౌసింగ్ ఎఇ లోకేష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థలం ఉండి ఇంటి కోసం 594 మంది, స్థలం కోసం 684 మంది దరఖాస్తులు వచ్చాయన్నారు. అయితే దళారులను నమ్మి ఎవరు మోసపోవద్దని.. అర్హులకు తప్పనిసరిగా లబ్ధి చేకూరుతుందన్నారు.

పట్టణాభివృద్ధిపై దృష్టి సారించండి

అధికారులకు కౌన్సిల్ సభ్యుల సూచన

ప్రజాశక్తి-రాయదుర్గం

కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న సభ్యుడు బండి అజయ్

రాయదుర్గం పట్టణంలో అభివృద్ధి పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని పురపాలక మండలి సభ్యులు సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో పురపాలక సంఘం అధ్యక్షురాలు పొరాళు శిల్ప అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ప్రధాన రహదారి విభాగిని వద్ద మొక్కలు పెంచాలని కోరారు. కోట ముఖద్వారం జీర్ణోదరణకు అడ్డుగా ఉన్న మురికి నీటి కాలువను మళ్లించాలని కోరారు. పలుచోట్ల వీధి దీపాలు వెలగడం లేదని నిర్వహణకు అవసరమైన సిబ్బందిని నియమించాలన్నారు. భంభం స్వామి ఆశ్రమం రోడ్డు ఆక్రమణకు గురి కాకుండా రహదారికి ఇరువైపులా మురికి కాలువలు నిర్మించాలన్నారు. ఇందుకు మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి సమాధానం ఇస్తూ రాష్ట్ర పట్టణాభివృద్ధి మౌలిక సదుపాయాల కల్పన సంస్థ నుంచి రూ.75కోట్ల అంచనాతో పట్టణాభివృద్ధికై సమగ్ర అభివృద్ధి ప్రణాళికను రూపొందించి ఉన్నతాధికారులకు పంపినట్లు తెలిపారు. నిధులు మంజూరైన వెంటనే అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. సమావేశంలో సంఘం ఉపాధ్యక్షులు శ్రీనివాస్‌యాదవ్, వలిబాషా, మున్సిపల్ ఇంజినీర్లు సురేష్, నరసింహులు, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవీంద్ర, వార్డు సభ్యులు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి-రాయదుర్గం

చెక్కులు పంపిణీ చేస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందిన 33 మంది నిరుపేద కుటుంబాలకు సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ.19,70,950 లక్షల చెక్కులను విప్ కాలవ శ్రీనివాసులు శనివారం రాయదుర్గంలోని నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర సరిహద్దున, వెనుకబడిన రాయదుర్గం నియోజకవర్గంలో బళ్లారి, బెంగళూరు మొదలైన నగరాలకు వెళ్లి అప్పు చేసి వ్యయ ప్రయాసలకు ఓర్చి వైద్య సేవలు పొందిన వారికి సిఎం సహాయ నిధి నుంచి ఆర్థికసాయం అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ నాగేళ్ల వెంకటేశులు, సగర కార్పొరేషన్ డైరెక్టర్ యు.ఆనందరాజు, డి.హీరేహాల్, రాయదుర్గం, గుమ్మఘట్ట మండలాల టిడిపి కన్వీనర్లు కాదలూరు మోహన్‌రెడ్డి, కురుబ హనుమంతు, కాలవ సన్నన్న, తదితరులు పాల్గొన్నారు.

అవయవదానంపై అభినందనలు

అనారోగ్యంతో మృతి చెందిన వ్యక్తి అవయవాలను ఇతరులకు దానం చేసి జీవం పోసినందుకు ఆ కుటుంబీకులను విప్ కాలవ శ్రీనివాసులు అభినందించారు. పట్టణానికి చెందిన కురాకుల లక్ష్మన్న కుమారుడు ఆంజనేయులు గత జూలైలో బెంగళూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. ఆంజనేయులు మరణానంతరం అతడి గుండె, కాలేయం మూత్రపిండాలను నలుగురికి దానం చేసేందుకు ముందుకు వచ్చారు. దీంతో కర్ణాటక రాష్ట్ర ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అవయవదానం చేసిన ఆంజనేయులు కుటుంబాన్ని అభినందించారు. ఈనేపథ్యంలో ఆంజనేయులుకు మంజూరైన సిఎం రిలీఫ్ రూ.1.57లక్షల చెక్కును కుటుంబ సభ్యులకు అందజేసి అభినందలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం మాజీ అధ్యక్షులు జయంతి సురేష్ కుమార్, ప్రతినిధులు లక్ష్మీనారాయణ, శంకర్, చంద్రశేఖర్, రాజేష్, మురళి, మధు, హరికృష్ణ, మదన్, తదితరులు పాల్గొన్నారు.

వైసిపి రాష్ట్ర కార్యదర్శి సత్యనారాయణరెడ్డికి సన్మానం

సత్యనారాయణరెడ్డిని సన్మానిస్తున్ననాయకులు

ప్రజాశక్తి-నార్పల

నూతనంగా మండల కమిటీకి ఎన్నికైన సభ్యులు వైసిపి రాష్ట్ర కార్యదర్శి నార్పల సత్యనారాయణరెడ్డిని శనివారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసిపి రైతుసంఘం అధ్యక్షులు బయపరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ నాగలింగారెడ్డి, మండల కార్యదర్శి కపాడం రాజకుల్లాయప్ప, మండల కన్వీనర్ ఖాదర్ వలిఖాన్, నాయకులు పట్నం ఫణీంద్ర, రేవంత్‌రెడ్డి, ముచ్చుకుంటల్లి వెంకటనారాయణరెడ్డి, కురగానపల్లి గోపాల్‌రెడ్డి, తుంపెర పక్కిరెడ్డి, రామచంద్రారెడ్డి, లింగారెడ్డి, వెంకటరామిరెడ్డి, రాజేష్, బాలకృష్ణ, రామదాస్, కృష్ణమూర్తి, రమణ, శ్రీరామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు. .

కనకదాసు జయంతి

ప్రజాశక్తి-శింగనమల

ఊరేగింపులో పాల్గొన్న నాయకులు

మండల పరిధిలోని శోదనపల్లి గ్రామంలో కురువ సంఘం ఆధ్వర్యంలో భక్త కనకదాస జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత అందంగా అలంకరించిన వాహనంలో కనకదాస విగ్రహాన్ని కొలువుదీర్చి గ్రామ పురవీధుల గుండా ఊరేగించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కురువ సంఘం జిల్లా అధ్యక్షులు రాజహంస శ్రీనివాసులు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా కురువ సంఘం నాయకులు, ప్రజలు అందరూ ఐకమత్యంతో ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి అందిస్తున్న గొర్రెలపై సబ్సిడీ లోన్లను కురువ సంఘాలకు ఇప్పిస్తే కురుబలు అభివృద్ధి చెందుతారన్నారు. అంతేగాకుండా కురవ సంఘం ద్వారా విద్యార్థులకు శిక్షణ ఇప్పిస్తూ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే ఉద్యోగాలు సాధించి ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారన్నారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో గొర్ల సంఘం మండల అధ్యక్షులు, కార్పొరేషన్ డైరెక్టర్ మంకెన నాగేంద్ర, శోదనపల్లి కురవ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజాదర్బార్

ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజాశక్తి-పామిడి

ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్

ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రభుత్వం ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ తెలిపారు. శనివారం పామిడి పంచాయతీ కార్యాలయంలో పామిడి ఇన్‌ఛార్జి గుమ్మనూరు ఈశ్వర్ ఆధ్వర్యంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించి ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ప్రజాదర్బార్ కార్యక్రమం లక్ష్యమన్నారు. ప్రధానంగా ప్రజలు ఎదుర్కొంటున్న విద్య, వైద్యం, రోడ్లు, గృహ నిర్మాణం వంటి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ షర్మిల, ఎంపిడిఒ తేజోష్ణ, డిప్యూటీ ఎంపిడిఒ అశ్వర్థమనాయుడు, విద్యుత్ అధికారి మధుసూదన్, వ్యవసాయ అధికారి విజయకుమార్, మండల విద్యాధికారి జయానాయక్, ఎపిఒ ఆదినారాయణమ్మ, ఎపిఎం నల్లప్ప, టిడిపి సీనియర్ నాయకులు బొల్లు శ్రీనివాస్‌రెడ్డి, జింకల సంజీవకుమార్, లంగాల గౌస్, టౌన్ కన్వీనర్ బొమ్మా మోహన్, మండల కన్వీనర్ సురేష్‌రెడ్డి, పసల శ్రీరాములు, కరూరు శివశంకర్, కాలవగడ్డ పెద్ద రంగనాయకులు, కొట్టాల ఓబులేష్, రామాంజనేయులు, నిమ్మకాయల శీన, ముసిలిరెడ్డి, కొట్టం మాలిక్, తేల్ బాషా, రఫీ, హుస్సేన్‌పీరా, ఆర్యవైశ్య నాయకులు బాబు, నల్లబోతుల శీన, కొండాపురం రవి, జనసేన ధను, ఎన్‌డిఎ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

మృతిచెందిన రవి

బ్రహ్మసముద్రం : మద్యం మత్తులో ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం మండల పరిధిలోని ఎరిడికెర గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. ఎరడికెర గ్రామానికి చెందిన బోయ గజ్జె రవి (28) కర్ణాటక రాష్ట్రానికి చెందిన గౌరమ్మతో ఎనిమిదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి నాలుగేళ్ల గౌతమ్‌నందు, మూడేళ్ల ప్రియ, మూడు నెలల బేబీ ఉన్నారు. రవి వృత్తి రీత్యా ఆటో డ్రైవర్. ఈనేపథ్యంలో కుటుంబ పోషణ కోసం చేసిన అప్పులు తీర్చలేక, మరోవైపు సంఘాలకు నెలసరి డబ్బులు చెల్లించలేక ఆర్థిక సమస్యలతో భార్యాభర్తలు గొడవ పడి భార్యను పుట్టింట్లో వదిలి వచ్చాడు. ఈనేపథ్యంలో శనివారం ఉదయం సొంత ఆటోలో వ్యవసాయ కూలీలను వదిలి మద్యం తాగి ఇంట్లో ఫ్యానుకు చీరతో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమణించిన ఇరుగుపొరుగు వారు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని కిందికి దించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుత్తి : పట్టణంలోని ఎంపిడిఒ కార్యాలయం ఎదురుగా ద్విచక్ర వాహనం డివైడర్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో శనివారం వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుత్తి మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన రంగనాయకులు గొర్రెల వ్యాపారం చేస్తూ జీవనం సాగించేవాడు. ఈక్రమంలో అనంతపురంలోని మార్కెట్ యార్డులో గొర్రెల వ్యాపారం చేసుకుని తిరిగి స్వగ్రామానికి బయలుదేరాడు. అయితే గుత్తి ఆర్ఎస్ రోడ్డులో రైల్వే బ్రిడ్జి సమీపంలో ముందు వెళ్తున్న లారీని దాటుకునే క్రమంలో డివైడర్ ను ఢీ కొన్నాడు. ప్రమాదంలో బైక్ లో నుంచి ఎగిరి పడి రంగనాయకులు తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు వెంటనే అతడిని చికిత్స నిమిత్తం గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్సకు అనంతపురానికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రైతు ఆత్మహత్యాయత్నం

గుత్తి : గుంతకల్లు మండల పరిధిలోని మొలకలపెంట గ్రామానికి చెందిన ఓ రైతు శనివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా మేరకు గుంతకల్లు మండలంలోని మొలకలపెంట గ్రామానికి చెందిన రైతు చంద్ర గత కొన్నినెలలుగా అనారోగ్య సమస్యతో పాటుగా కుటుంబ సమస్యలతో బాధపడుతుండేవాడు. ఈ క్రమంలో పలు ఆసుపత్రుల్లో చికిత్సలు చేయించుకున్నా వ్యాధి నయం కాలేదు. దీంతో తీవ్ర మనస్తాపం చెందిన చంద్ర తన వ్యవసాయ పొలంలో విషద్రావకం తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. అపస్మారక స్థితిలో పడి ఉన్న చంద్రను గమనించిన తోటి రైతులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. పొలానికి చేరుకున్న కుటుంబసభ్యులు ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్టు తెలుసుకుని వెంటనే చికిత్స నిమిత్తం చంద్ర ను గుత్తి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అయ్యప్ప మాలధారులకు అన్నదానం

అన్నదానం చేస్తున్న సాంబశివారెడ్డి

ప్రజాశక్తి-బుక్కరాయసముద్రం

మండల పరిధిలోని చెరువు కట్టపై ఉన్న అయ్యప్ప స్వామి భక్తులకు వైసిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలూరు సాంబశివారెడ్డి, మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి ఆధ్వర్యంలో శనివారం అన్నదానం చేశారు. ముందుగా అయ్యప్ప స్వామికి పూజలు చేశారు. ఈ సందర్భంగా దాదాపు వెయ్యిమంది భక్తులకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి ఆంజనేయ స్వామి మాట్లాడుతూ అయ్యప్పస్వామి కృప ఎల్లప్పుడూ సాంబశివారెడ్డి కుటుంబపై ఉండాలని ఆకాంక్షించారు.

విద్యార్థులు నైపుణ్యాలను పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి-గుత్తి


ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, అతిథులు

సాంకేతిక పరిజ్ఞానంతో పాటు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను విద్యార్థులు పెంపొందించుకోవాలని ఐసిటి అకాడమీ జిల్లా అధికారి ప్రవీణ్ సూచించారు. గేట్స్ ఇంజనీరింగ్ కళాశాల ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ విభాగం ఆధ్వర్యంలో శనివారం గేట్స్ పాలిటెక్నిక్ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు ఐసిటి అకాడమీ సకారంతో జరిగిన ఐబిఎం స్కిల్స్ బిల్డ్ ఆన్ క్లౌడ్ అనే నాలుగు రోజుల శిక్షణ శనివారం ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్లౌడ్ కంప్యూటింగ్‌పై ప్రయోగిక జ్ఞానం అవగాహన కలిగి ఉండాలన్నారు. పరిశ్రమల్లో ఉద్యోగ అవకాశాల పెంపు కోసం అవసరమైన ప్రాక్టికల్ నైపుణ్యాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో గేట్స్ ఇంజినీరింగ్ కళాశాల ఎండి రఘునాథ్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీవాణి, ప్రిన్సిపాల్ సుధాకర్, ఎఒ ఇంతియాజ్ బాషా, గేట్స్ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ శివారెడ్డి, ప్లేస్మెంట్ అధికారి తన్వీర్, తదితరులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న ఆడిట్ బృందం సభ్యులు

నారాయణపల్లిలో ఆడిట్ బృందం పర్యటన

పుట్లూరు : మండలంలోని సి.వెంకన్నపల్లి గ్రామపంచాయతీ నారాయణపల్లిలో సోషల్ ఆడిట్ బృందం శనివారం పర్యటించింది. ఇందులో భాగంగా గత మూడు మాసాల క్రితం గ్రామ పంచాయతీలో సోషల్ ఆడిట్ టీం, ఇతర శాఖల అధికారులతో చర్చించిన అంశాలపైన పురోగతి ఏమైనా ఉందా.. అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సోషల్ ఆడిట్ రాష్ట్ర డైరెక్టర్ జి.శ్రీకాంత్, ప్రోగ్రాం మేనేజర్ ఎంఎన్.సునిల్‌కుమార్, ఎస్‌టిఎం ఎం.కోనయ్య, తాడిపత్రి ఎపిడి పుల్లారెడ్డి, ఎంపిడిఒ అలివేలమ్మ, ఎపిఒ తులసీప్రసాద్, సాంకేతిక సహాయకులు గంగాదేవి, ఆంజనేయులు, రామాంజనేయులు, శంకర్, బిఎఫ్‌టిలు ప్రసాద్, రామాంజిరెడ్డి, పంచాయతీ సెక్రటరీ గంగాదేవి పాల్గొన్నారు.

స్కూల్ అసిస్టెంట్లకు ఉద్యోగోన్నతులు కల్పించాలి

ప్రజాశక్తి-అనంతపురం

సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎన్.రమణారెడ్డి

ఉమ్మడి సర్వీస్ రూల్స్ సమస్యను పరిష్కరించి అర్హత ఉన్న స్కూల్ అసిస్టెంట్లకు లెక్చరర్లుగా ఉద్యోగోన్నతులు కల్పించాలని ఎస్‌టియు జిల్లా అధ్యక్షులు ఎన్.రమణారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం నగరంలోని ఎస్‌టియు జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పిఆర్‌సి ప్రకటనకు ఆలస్యం అవుతున్న నేపథ్యంలో తక్షణమే పిఆర్‌సి కమిషన్ ఏర్పాటు చేసి ఐఆర్ 30 శాతం ప్రకటించాలని, కెజిబివిల్లో పని చేసే సిబ్బందికి మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వీటితోపాటు అనేక సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.రామాంజనేయులు, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి జి.సూర్యుడు, రాష్ట్ర మున్సిపల్ ఉపాధ్యాయుల కన్వీనర్ బి.ఫణిభూషణ్, జిల్లా కార్యదర్శి జి.మల్లికార్జున, గండికోట నారాయణస్వామి, ముఖ్య నాయకులు బాబ్జీనాయక్, నిట్టూరు చంద్రశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎఐబిఎస్‌ఎస్ జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆల్ ఇండియా బంజారా సేవా సంఘ్ (ఎఐబిఎస్‌ఎస్) జిల్లా నూతన కమిటీ ప్రమాణ స్వీకారోత్సవం నిర్వహించనున్నట్లు రాష్ట్ర అధ్యక్షులు చక్రే నాయక్, జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బాలాజీనాయక్, రవీంద్ర నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంబేద్కర్ భవన్‌లో ప్రమాణస్వీకారోత్సవ ఉంటుందన్నారు. అంతకుముందు పిటిసి నుంచి బంజారాలు బైక్ ర్యాలీగా టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్, సాయినగర్ మీదుగా అంబేద్కర్ భవన్‌కు చేరుకోనున్నట్లు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి వద్ద అన్నదానం

ప్రజాశక్తి-అనంతపురం

కేక్ కోస్తున్న జెఎల్ మురళి, తదితరులు

అర్బన్ బ్యాంకు ఛైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి జెఎల్ మురళీధర్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని డైరెక్టర్ మాగిశెట్టి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పెద్దాసుపత్రి, పలు వృద్ధాశ్రమాలు, అనాథాశ్రమాల్లో అన్నదానాలు చేశారు. అలాగే స్వామి దయానంద గురుకులంలో విద్యా సామగ్రి పంపిణీ చేశారు. ముందుగా అర్బన్ బ్యాంకులో పాలకవర్గ సభ్యులు, బ్యాంకు సిబ్బంది ఆధ్వర్యంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. సాయంకాలం జెఎల్ మురళి నివాసం వద్ద భారీగా ఏర్పాటు చేసిన డీజే లైటింగ్స్ మధ్య చిన్నారుల నృత్యాలు అలరించాయి.

అనంతపురం ప్రిన్సిపల్ సబార్డినేట్ జడ్జి గారి కోర్టులో
E.A.182/2025 E.P 165/18 OS 144/2001
Between:
B.K.V.చలపతి ...DHr
V/s
P.లక్ష్మీ మరియు ఇతరులు ...JDrs
NOTICE TO J.Drs 4 TO 7
J,Dr No 4: P.నారమ్మ భర్త Late P.చితంబరరెడ్డి కలగల్ల గ్రామము, కూడేరు మండలం.
J.Dr No5 : P.రాజశేఖర రెడ్డి తండ్రి P.నారాయణ రెడ్డి
J.Dr No6 : P.విశ్వనాథండ్డి తండ్రి P.నారాయణ రెడ్డి
J.Dr No7 : P.మణికంఠ రెడ్డి తండ్రి P.నారాయణ రెడ్డి
5 to 7 Residing at D.No 11/269 అరవిందనగర్, అనంతపురం.
పై దావాలో 4 to 7 ప్రతివాదులు పై కోర్టు వారి యెదుట 10-12-2025 తేదీన ఉదయం 10:30 గంటలకు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని హాజరు కావలెను. అట్లు కాని యెడల సదరు J.Drs 4 to7 లను ఎక్స్‌పార్టి చేసి వారి పరోక్షమున పై దావా తీర్మానించెదరు. పై సంగతి యిందుమూలముగా యావన్మందికి తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
L.K.SUDEENDRANATH
M.A.NAGESWARI
DHr పరం న్యాయవాదులు, అనంతపురం

అంగన్వాడీ కేంద్రాల్లో గ్లాసులు పంపిణీ

నార్పల : మండల పరిధిలోని కేశేపల్లి గ్రామంలో గ్రామంలో అంగన్వాడీ కేంద్రాలకు పంచాయతీ కార్యదర్శి లక్ష్మీదేవి కంచాలు, గ్లాసులను శనివారం పంపిణీ చేశారు. లక్ష్మీదేవి తండ్రి కీర్తిశేషులు ఓబులేష్ జ్ఞాపకార్థం అంగన్వాడీ కేంద్రాలకు అవసరమైన కంచాలు, గ్లాసులు పంపిణీ అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు, సచివాలయ ఉద్యోగులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

దుకాణాల్లో తనిఖీలు

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ఉద్దేహల్ గ్రామంలో ఉన్న పలు దుకాణాలను తూనికలు, కొలతల అధికారి శంకర్ ఆధ్వర్యంలో శనివారం తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా ఎంఆర్‌పి ధరల కంటే అధిక ధరలకు విక్రయిస్తున్న దుకాణాలకు అపరాధ రుసుం విధించినట్లు శంకర్ తెలిపారు.

అన్నదానం

రాప్తాడు : మండల పరిధిలోని హంపాపురం గ్రామంలో జాతీయ రహదారి పక్కన వెలసిన అభయాంజనేయ స్వామి దేవస్థానం వద్ద ప్రతి శనివారం అన్నదానం చేస్తున్నట్లు ఆయల ధర్మకర్తలు తెలిపారు. ఇందులో భాగంగా భక్తులు పొలినేని శ్రీధర్‌చౌదరి శనివారం అన్నదానానికి సహకరించారు. ముందుగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు సంజీవరాయుడు, వెంకటపతి, రమణారెడ్డి, బసప్ప, తదితరులు పాల్గొన్నారు.

యాడికి సీఐగా ఆర్.శ్రీనివాసులు

ప్రజాశక్తి-యాడికి

యాడికి అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సిఐగా ఆర్.శ్రీనివాసులును నియమిస్తూ ఎస్పీ పి.జగదీష్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇక్కడ పని చేస్తున్న ఎం.ఈరన్నను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు విఆర్‌కు పంపిన విషయం తెలిసిందే. ఆయన స్థానంలో ఆర్.శ్రీనివాసులును నియమించారు.

నివాళులర్పిస్తున్న టిడిపి నాయకులు

టిడిపి కార్యకర్తల మృతికి నివాళి

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని ఈస్టు నరసాపురంలో అనారోగ్యంతో మృతిచెందిన టిడిపి కార్యకర్తలకు మండల నాయకులు నివాళులర్పించారు. ఈస్టు నరసాపురం గ్రామానికి చెందిన బోడపాటి నవీన్, దూదేకుల ఫక్రుద్దీన్ అనారోగ్యంతో శనివారం తెల్లవారుజామున మృతిచెందారు. విషయం తెలుసుకున్న టిడిపి నాయకులు మృతుల ఇళ్లకు చేరుకుని మృతదేహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. నివాళులర్పించిన వారిలో టిడిపి సీనియర్ నాయకులు లాయర్ ఈశ్వర్‌రెడ్డి, టిడిపి మండల కన్వీనర్ గోరంట్ల మారుతీనాయుడు, సీనియర్ నాయకులు ఓబులేసు నాయుడు, మాజీ సర్పంచు అట్టే రామాంజనేయులు, ఏకుల ఆదినారాయణ, నరేంద్రనాయుడు, చిన్న ఓబులేష్ నాయుడు, నరేష్‌నాయుడు, బోయ సూర్యనారాయణ, ఏకుల లక్ష్మయ్య, తదితరులు ఉన్నారు.

టెన్త్ స్టడీ మెటీరియల్ పోస్టర్ విడుదల

ప్రజాశక్తి-శింగనమల

మండల పరిధిలోని ఆకులేడు జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో యుటిఎఫ్ రూపొందించిన 2026వ సంవత్సరం టెన్త్ స్టడీ మెటీరియల్ పోస్టర్లను ఎంఇఒ శివప్రసాద్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు గోవిందరాజులు, జిల్లా ఆడిట్ కమిటీ కన్వీనర్ చంద్రమోహన్, సీనియర్ నాయకులు నాగేంద్ర, ఎపిటిఎఫ్ 1938 నాయకులు వెంకటసుబ్బయ్య, ఎపిటిఎఫ్ 257 నాయకులు సూర్యనారాయణ, వేణుగోపాల్, నగేష్‌కుమార్, జయరాములు, తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు : సిడిపిఒ

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

అంగన్వాడీ కార్యకర్తలు విధులు పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని ఐసిడిఎస్ సిడిపిఒ లక్ష్మీప్రసన్న హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని బైరసముద్రం గ్రామంలో బరువు తక్కువ నమోదు కేంద్రాల అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా సిడిపిఒ మాట్లాడుతూ ప్రతి అంగన్వాడీ కార్యకర్త పుట్టిన బిడ్డ నుంచి ఆరేళ్లలోపు పిల్లలకు ఖచ్చితమైన ఎత్తు, బరువు నమోదు చేయాన్నారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్‌వైజర్ రామాంజనమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పౌర హక్కులకు భంగం కలిగించొద్దు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

పౌర హక్కులకు ఎవరు భంగం కలిగించినా చర్యలు తప్పవని తహశీల్దార్ సుమతి హెచ్చరించారు. శనివారం మండల పరిధిలోని పొబ్బర్లపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో ఉన్న ఆర్డీటీ అభ్యుదయ భవన్‌లో పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ భారత రాజ్యాంగంలోని పౌరులందరికీ ఒకే హక్కులు ఉన్నాయన్నారు. చట్టం ముందు అందరూ సమానులే అన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల్లో ఎలాంటి బేధాభిప్రాయం చూడకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ ఉమాదేవి, ఆర్ఐ నాగిరెడ్డి, వీఆర్వో లక్ష్మన్న, వసతి గృహ సంక్షేమ అధికారి శ్రీనివాసులు, ఎఎన్ఎం రోజా, ఎంఎల్‌హెచ్‌పి మహాలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు సుజాత, భారతి, తదితరులు పాల్గొన్నారు.

కార్యక్రమంలో మాట్లాడుతున్న తహశీల్దార్ సుమతి

ఉపాధ్యాయుల సంక్షేమానికి ప్రాధాన్యత

ప్రజాశక్తి-రాయదుర్గం

రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయుల సంక్షేమానికి తగిన ప్రాధాన్యత ఇస్తోందని విప్ కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని మైదానంలో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల క్రీడలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఇందులో భాగంగానే విద్యార్థులకే కాకుండా ఉపాధ్యాయుల కోసం కూడా ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా క్రీడాపోటీలు నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు ఇర్షాద్‌అహ్మద్, వెంకట రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రీడల ప్రారంభోత్సవంలో విప్ కాలవ శ్రీనివాసులు

క్రీడలను ప్రారంభిస్తున్న విప్ కాలవ శ్రీనివాసులు

యల్లనూరు : ప్రభుత్వ ఆదేశాల మేరకు మండల స్థాయి ఉపాధ్యాయులకు శనివారం తిమ్మంపల్లి జిల్లా ఉన్నత పాఠశాలలో క్రీడాపోటీలు నిర్వహించారు. ఇందులో మహిళా ఉపాధ్యాయిలకు త్రో బాల్, పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించినట్లు మండల విద్యాశాఖ అధికారులు చంద్రశేఖర్, పరమేశ్వరరెడ్డి తెలిపారు.

బొమ్మనహాల్ : మండల పరిధిలోని ఉద్దేహాల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు క్రీడాపోటీలు నిర్వహించారు. ఈకార్యక్రమానికి ఎంపిడిఒ విజయభాస్కర్, ఎస్ఐ నబిరసూల్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఉపాధ్యాయులుకు క్రికెట్, త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి వీరన్న, ప్రధానోపాధ్యాయులు ఆదిశేషయ్య, తదితరులు పాల్గొన్నారు.

గుంతకల్లు : రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక ఎస్‌కెపి ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు శనివారం త్రోబాల్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి మస్తాన్‌రావు, ఎంఇఒ సుబ్బరాయుడు, ప్రధానోపాధ్యాయుడు మురళీకృష్ణ, మండల ఎస్జిఎఫ్ కోఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

బెలుగుప్ప : మండలంలోని వివిధ యాజమాన్య పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం క్రీడా పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గుత్తి డివిజినల్ ఉప విద్యాశాఖాధికారి పి పాటిల్ మల్లారెడ్డి, టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఎంఇఒ హరికృష్ణ, ప్రధానోపాధ్యాయులు వెంకట ప్రసాద్, నాయకులు లక్ష్మీనారాయణ, ఎర్రిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ పాఠశాల క్రీడా మైదానంలో ఎపిఎస్‌జిఎఫ్ ఉపాధ్యాయులకు శనివారం క్రీడాపోటీలు నిర్వహించారు. క్రీడాపోటీల్లో క్రికెట్ పురుషుల విభాగంలో ఎంఇఒ ఎం.ప్రేమ్‌కుమార్ టీం విజయం సాధించింది. త్రో బాల్ మహిళ ఉపాధ్యాయుల క్రీడలో జి .రిబ్కా టీం విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు పి.శ్రీదేవి, హెచ్ఎం ప్రమీల, మండల స్పోర్ట్స్ కోఆర్డినేటర్ జిశ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై కమ్యూనిస్టుల ఉద్యమాలు చారిత్రాత్మకం

సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి

ప్రజాశక్తి-తాడిపత్రి

భూమి కోసం.. భుక్తి కోసం.. వెట్టి చాకిరి విముక్తి కోసం వంద సంవత్సరాలుగా ప్రజా సమస్యలపై కమ్యూనిస్టులు చేస్తున్న ఉద్యమాలు చారిత్రాత్మకమని సిపిఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి అన్నారు. శనివారం పట్టణంలోని మాంగల్య ఫంక్షన్ హాల్‌లో నియోజవర్గ కార్యదర్శి రంగయ్య అధ్యక్షతన తాడిపత్రి నియోజకవర్గ సిపిఐ జనరల్ బాడీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డిసెంబర్ 10వ తేదీన అనంతపురంలో జరుగే శత వసంతాల వేడుకల సందర్భంగా పోరాటయోధుల కుటుంబాలకు ఆత్మీయ సన్మానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఇకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు సూర్యనారాయణరెడ్డి, చింతా పురుషోత్తం, వెంకట్రాముడు, నాగ రంగయ్య, చిరంజీవి, రఫీ, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి కోసమే సర్వసభ్య సమావేశం

ఎంపిపి యోగేశ్వరి, ఎంపిడిఒ భాస్కర్

ప్రజాశక్తి-శింగనమల

మండలంలోని గ్రామాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకే మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపిపి యోగేశ్వరి, ఎంపిడిఒ భాస్కర్ తెలిపారు. శనివారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఇందులో భాగంగా మండలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు, గ్రామాల వారీగా జరుగుతున్న పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు చేరాల్సిన ప్రభుత్వ పథకాల అమలులో ఎక్కడైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో అధికారులు, సర్పంచులు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.



ఎంపిపికి వినతిపత్రం అందజేస్తున్న గుమ్మేపల్లి సర్పంచి

పాఠశాలల బస్సులు తనిఖీ

ప్రజాశక్తి-రాయదుర్గం

ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండవ రోజు శనివారం పట్టణంలోని పలు పాఠశాలల బస్సులను మోటార్ వాహనాల రవాణా తనిఖీ అధికారి ఎం.విశ్వనాథరెడ్డి శనిఆవరం తనిఖీ చేశారు. ఇందులో భాగంగా దాదాపు 34 పాఠశాలల బస్సులను తనిఖీ చేసి కండీషన్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా స్పీడ్ గవర్నర్ పని విధానం, వాహనం కండిషన్, వాహనం వయసు తనిఖీ చేసి నిబంధనలను పాటించని 20 వాహనాలకు నోటీసులు జారీ చేశారు.



ఇంజన్ రక్షణ తీరును పరిశీలిస్తున్న ఎంవిఐ విశ్వనాథరెడ్డి

బడుగు, బలహీన వర్గాలపై పెరుగుతున్న దాడులు

మాజీ ఎంపి తలారి రంగయ్య

ప్రజాశక్తి-అనంతపురం

బిసి, ఎస్సీ, ఎస్టీ బలహీన వర్గాలపై అధికార పార్టీ నాయకుల అండదండలతో దాడులు పెరిగిపోతున్నాయని మాజీ ఎంపి తలారి రంగయ్య మండిపడ్డారు. శనివారం అనంతపురంలోని వైసిపి జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అధికార పార్టీ మద్దతుతోనే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలపై దాడులు, అణచివేతలు పెరిగిపోతున్నాయన్నారు. ఈ ధోరణిని ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా కళ్యాణదుర్గం నియోజకవర్గంలో ఎమ్మెల్యే సురేంద్రబాబు అండదండలతో అక్రమాలు, దాడులు పెరిగిపోయాయన్నారు. బెల్ట్‌షాపుల ద్వారా ప్రతి బాటిల్‌పై అదనంగా వసూలు చేస్తూ ఆ సొమ్ముతో విగ్రహావిష్కరణలు చేస్తున్నారని ఆరోపించారు. బోయ ఆనంద్ కుటుంబానికి న్యాయం జరగాలంటే దోషులను కఠినంగా శిక్షించాలని, బాధితుడి కుటుంబ సభ్యుల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, రూ.కోటి నష్టపరిహారం, ఐదెకరాల భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో బోయ ఆనంద్ తల్లిదండ్రులు వెంకటేశులు, వరలక్ష్మి, ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చామలూరు రాజగోపాల్, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి యర్రంపల్లి కృష్ణమూర్తి, బ్రహ్మసముద్రం, కళ్యాణదుర్గం రూరల్ కన్వీనర్లు పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గోళ్ల సూరి, కంబదూరు జడ్పీటీసీ గుద్దిళ్ల నాగరాజు, మున్సిపల్ విభాగం అధ్యక్షులు దొడగట్ట మురళి, లీగల్‌సెల్ అధ్యక్షులు రామాంజినేయులు, ఎనుములదొడ్డి సర్పంచు విజయ్‌కుమార్, వైసిపి సీనియర్ నాయకులు భాస్కర్, అంకంపల్లి గోపాల్, జానీ, తదితరులు పాల్గొన్నారు.

విలేకరులతో మాట్లాడుతున్న తలారి రంగయ్య

'ఆనంద్ మృతికి మా కుటుంబానికి సంబంధం లేదు'

ఆడపిల్లల జీవితాన్ని రాజకీయం చేయొద్దు

ప్రజాశక్తి- అనంతపురం కలెక్టరేట్

ఇటీవల కళ్యాణదుర్గంలో ఆత్మహత్య చేసుకున్న యాటకల్లుకు చెందిన ఆనంద్ అనే యువకుడి మృతికి మా కుటుంబానికి ఎలాంటి సంబంధమూ లేదని కళ్యాణదుర్గంకు చెందిన జ్యోతి, టి.గోవిందప్ప దంపతులు తెలిపారు. శనివారం ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బ్రహ్మసముద్రం మండలం యాటకల్లుకు చెందన ఆనంద్ తమ కుమార్తె అభినయను మైనర్ అయినా ప్రేమ పేరుతో వేధించాడన్నారు. కొద్ది నెలల తరువాత మా అమ్మాయిని మా కులానికి చెందిన అబ్బాయికిచ్చి వివాహం చేశామన్నారు. ఆనంద్ అభినయ భర్త ప్రసాద్‌కు ఫోన్ చేసి తామిద్దరం ప్రేమించుకున్నామని, ఎప్పటికైనా తాము ఒకటైతామంటూ ఇష్టారీతిన మాట్లాడటంతో కూతురు, అల్లుడికి కలహాలు ఏర్పడి విడాకులు తీసుకున్నారని తెలిపారు. మూడేళ్ల వరకు తమ కుమార్తె ఇంట్లోనే ఉండటంతో మరొక అబ్బాయితో వివాహం చేయడానికి పెళ్లి కుదుర్చుకున్నామన్నారు. ఈ సందర్భంలో ఆనంద్ మా అమ్మాయికి ఫోన్ చేసి పురుగుల మందు తాగుదాం అప్పుడు మీ పెద్దలు మన పెళ్లికి ఒప్పుకుంటారని ఫోన్‌లో బెదిరించాడన్నారు. మా బాధలు చూసి మా అమ్మాయి మా ఇంట్లోనే ఉండిపోయిందన్నారు. కానీ ఆనంద్ ఆత్మహత్య చేసుకున్నట్లు గ్రామస్తుల ద్వారా తెలిసిందన్నారు. ఇప్పుడు ఆనంద్‌ను తామే హత్య చేసినట్లుగా ఆరోపణలు చేయడం బాధిస్తోందన్నారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆనంద్ కుటుంబ సభ్యులతో మీడియా సమావేశంలో మా కుటుంబ ప్రస్తావన చేయడం అన్యాయంగా ఉందన్నారు. సంఘటనపై పోలీసులతో విచారణ జరిపించి నిజా నిజాలు బయటపెట్టాలి తప్పా ఇలా లేనిపోని ఆరపణలతో మా అమ్మాయి జీవితాన్ని, కుటుంబాన్ని ఇబ్బందులు పెట్టొద్దని విజ్ఞప్తి చేశారు. తప్పు మా వైపు తేలితే శిక్షకు తాము సిద్ధం అన్నారు. రాజకీయాలకు తావు లేకుండా చూడాలని కోరారు.